సాక్షి రంగారెడ్డి

శనివారం । 7 । జూన్ । 2025



కళాశాలగా కస్తూర్బా

జిల్లేడ్ చౌదరిగూడ మండలం తూంపల్లిలోని కేజీబీవీని జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేసినట్లు ప్రత్యేకాధికారి తెలిపారు. 10లో▸



దైవచింతనతో ప్రశాంతత

ప్రతిఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌కుమార్ రెడ్డి సూచించారు. 10లో▸



క్రమశిక్షణ అవసరం

ఎన్‌సీసీలో చేరుతున్న విద్యార్థులు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని కర్నల్ రావు పేర్కొన్నారు. 10లో▸

న్యూస్‌రీల్

రాజీద్వారా కేసుల పరిష్కారం ఉత్తమం



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి స్వరూప

ఆమనగల్లు: కక్షిదారులు రాజీద్వారా తమ కేసులను పరిష్కరించుకోవాలని ఆమనగల్లు ప్రథమశ్రేణి న్యాయమూర్తి కాటం స్వరూప సూచించారు. ఈనెల 14న నిర్వహించే లోక్ అదాలత్ నేపథ్యంలో పట్టణంలోని కోర్టు ఆవరణలో శుక్రవారం పోలీసు కో ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాజీమార్గమే రాజమార్గమని అన్నారు. చిన్నచిన్న కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకునే అవకాశం ఉన్నందున కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో ఏపీపీ కార్తీక్, ఆమనగల్లు సీఐ జానకిరాంరెడ్డి, కడ్తాల సీఐ గంగాధర్, మాడ్గుల సీఐ వేణుగోపాల్, ఎక్సైజ్ సీఐ బద్యనాథ్‌చౌహాన్, ఎస్ఐలు వెంకటేశ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కడారి చంద్రశేఖర్‌రెడ్డికి గౌరవ డాక్టరేట్



అవార్డు అందుకుంటున్న చంద్రశేఖర్‌రెడ్డి

హుడాకాంప్లెక్స్: ప్రముఖ విద్యావేత్త, సామాజిక సంస్కర్త కడారి చంద్రశేఖర్‌రెడ్డికి యూఎస్ఏ టెక్సాస్, డల్లాస్‌లోని డేస్ప్రింగ్ థియోలాజికల్ విశ్వవిద్యాలయం ప్రతిష్టాత్మకమైన గౌరవ డాక్టరేట్ అవార్డు 2025ను ప్రదానం చేసింది. ఈ అవార్డును నగరంలోని సూర్యలోక కాంప్లెక్స్‌లో జీఎస్‌హెచ్‌ఎస్‌టీపీ చైర్మన్, వ్యవస్థాపకుడు డా.ఎం.వరప్రసాద్ అందజేశారు. లోటస్‌ల్యాప్ పబ్లిక్ స్కూల్స్ వ్యవస్థాపక చైర్మన్‌గా, ఆయన వివిధ శాఖల్లో 25 సంవత్సరాలుగా 10 వేల మందికిపైగా విద్యార్థులకు సాధికారత కల్పించారు.

'బెస్ట్ అవైలబుల్'లో 43 సీట్లు

కడ్తాల్: బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో 2025–26 విద్యాసంవత్సరానికి సంబంధించి 3, 5, 8 తరగతుల్లో ప్రవేశాలను ఆహ్వానిస్తున్నామని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ సహాయ అధికారి ఉడుతనూరి వెంకటయ్య తెలిపారు. ఆయా తరగతుల్లో మొత్తం 43 సీట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ నెల 9నుంచి 13వ తేదీ వరకు జిల్లా గిరిజనాభివృద్ధి శాఖ కార్యాలయంలో దరఖాస్తు ఫారాలు అందజేస్తామని, 17న సాయంత్రం 5గంటలలోపు నేరుగా ఆఫీసులో లేదా పోస్టు ద్వారా అందించాలని సూచించారు. 21న లాటరీ విధానంలో విద్యార్థులను ఎంపిక చేస్తామని తెలిపారు.

తీర్థయాత్రలకు ప్రత్యేక ప్యాకేజీలతో బస్సులు

షాద్‌నగర్‌రూరల్: తీర్థయాత్రలకు వెళ్లాలనుకునే వారి కోసం ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించినట్లు షాద్‌నగర్ డిపో మేనేజర్ ఉష తెలిపారు. అరుణాచలం మూడు రోజుల ప్యాకేజీలో ఒక్కొక్కరికి రూ.3,600, శ్రీశైలం, మహానంది రెండు రోజుల ప్యాకేజీలో ఒక్కరికి రూ.1,750, విశాఖపట్నం, అరకు, బొర్రా గుహలు, సింహాచలం, అన్నవరం, ద్వారకా తిరుమల, విజయవాడలకు ఐదు రోజుల ప్యాకేజీలో ఒక్కరికి రూ.4,200, శ్రీకూర్మ, సూర్యనారాయణ దేవాలయం, విశాఖపట్నం బీచ్, కైలాసగిరి, అన్నవారం, విజయవాడకు ఐదు రోజుల ప్యాకేజీలో ఒక్కరికి రూ.4,200, యాదగిరిగుట్ట, స్వర్ణగిరి, సురేంద్రపురి ఒక్క రోజు ప్యాకేజీలో ఒక్కరికి రూ.600, వరంగల్, లక్నవరం, రామప్ప దేవాలయం, మేడారం, హన్మకొండ ఒక్కరోజు ప్యాకేజీలో ఒక్కరికి రూ.1,400, భద్రాచలం, పర్ణశాల ఒక్కరోజు ప్యాకేజీ రూ.1,700, వేములవాడ, కొండగట్టు ఒక్కరోజు ప్యాకేజీ రూ.1,400గా నిర్ణయించినట్టు చెప్పారు. బుకింగ్ కోసం 99592 26287, 91826 45281, 94409 19113, 88853 37761, 94900 21433, 79896 33779 నంబర్లలో సంప్రదించాలని ఆమె సూచించారు.

మాదాపూర్ మెట్రో ఇక 'ఐఐఎల్ మాదాపూర్'

సాక్షి, సిటీబ్యూరో: మాదాపూర్ మెట్రో స్టేషన్ పేరు మారింది. ఇక నుంచి ఐఐఎల్ మాదాపూర్ మెట్రో స్టేషన్‌గా పరిగణిస్తారు. ఇమ్యునైజేషన్ వ్యాక్సిన్ తయారీలో ప్రఖ్యాతి చెందిన ఇండియన్ ఇమ్యునలాజికల్ లిమిటెడ్ సంస్థ పేరు మీదుగా మాదాపూర్ మెట్రో స్టేషన్‌కు నామకరణం చేశారు. ఈ మేరకు ఎల్‌అండ్‌టీ హైదరాబాద్ మెట్రోరైల్, ఐఐఎల్ సంస్థల మధ్య శుక్రవారం ఒప్పందం కుదిరింది. మెట్రో సేవలు అభినందనీయమని ఇండియన్ ఇమ్యునలాజికల్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఏకే ఆనంద్‌కుమార్ తెలిపారు.

అమ్మో.. ఔటర్

ఔటర్ రింగ్ రోడ్డుపై తరచూ యాక్సిడెంట్లు

- అర్ధరాత్రి నుంచి తెల్లవారుజామునే అధికం
- నెల వ్యవధిలో నాలుగు ఘోర ప్రమాదాలు
- ప్రాణాలు కోల్పోయిన ఏడుగురు



ఔటర్‌పై ప్రమాద దృశ్యం (ఫైల్)

అబ్దుల్లాపూర్‌మెట్: ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రయాణమంటేనే హడలిపోవాల్సి వస్తోంది. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సి వస్తోంది. నగరంలోని వాహనాల రద్దీ నుంచి తప్పించుకుని శివారు ప్రాంతాలకు వెళ్లేందుకు నిర్మించిన ఔటర్ ఇప్పుడు వాహనదారుల పాలిట శాపంగా మారింది. విశాలంగా ఉన్న రోడ్డుపై హుషారుగా ప్రయాణిస్తున్న వాహనదారుల ప్రాణాలు కొంతమంది నిర్లక్ష్యం కారణంగా రెప్పపాటులో గాలిలో కలుస్తున్నాయి. అధిక శాతం ప్రమాదాలన్నీ అర్ధరాత్రి దాటిన తర్వాత నుంచి తెల్లవారుజామునే చోటుచేసుకుంటున్నాయి. గడిచిన నెల రోజుల వ్యవధిలో ఒక్క అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కేవలం ఔటర్ రింగ్ రోడ్డు, సర్వీస్ రోడ్డుపై 5 ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఆయా ప్రమాదాల్లో ఏడుగురు మృత్యువాత పడ్డారు.

నిర్లక్ష్యం.. నిద్రమత్తు

రింగ్‌రోడ్డుపై ప్రయాణిస్తున్న వాహనదారులు తమ వాహనాలను అధికారులు సూచించిన ప్రదేశాల్లో కాకుండా ఇష్టారీతిన ఎలాంటి సూచిక, హెచ్చరిక బోర్డులు లేకుండా నిలుపుతున్నారు. రోడ్డు విశాలంగా ఉండడంతో అప్పటికే వేగంతో వచ్చే వాహనాలకు నిలిపి ఉన్న వాహనాలను గమనించక వెనుక నుంచి వచ్చి ఢీకొట్టిన సంఘటనలే అధికంగా ఉన్నాయి. ఆగి ఉన్న వాహనదారులకు ప్రాణ నష్టం అంతగా జరగనప్పటికీ వెనుక నుంచి వచ్చి ఢీ కొట్టిన వాహనదారులే ప్రాణాలు కోల్పోతున్నారు. దీంతో పాటు తెల్లవారుజామున ఎక్కువ మంది వాహనచోదకులు నిద్రమత్తు కారణంగా కూడా రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.



"పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాం



ఔటర్‌పై ప్రమాదాల నివారణకు 5 మంది సిబ్బందితో 24 గంటలపాటు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాం. ప్రమాదాల నివారణకు ఇంకా ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న విషయాలపై అధ్యయనం చేస్తున్నాం. రాబోయే రోజుల్లో ప్రమాదరహిత ప్రయాణం కొనసాగేలా చర్యలు తీసుకుంటాం.

– ఘట్టుమల్లు, ఇన్‌స్పెక్టర్, వనస్థలిపురం ట్రాఫిక్ పీఎస్

ఇటీవల జరిగిన ప్రమాదాలు

- జూన్ 5న ఆగి ఉన్న కంటైనర్‌ను వెనుక నుంచి వచ్చిన డీసీఎం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో డీసీఎంలో కూర్చున్న వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు.
- మే 19న ఆగి ఉన్న పాల ట్యాంకర్‌ను వెనుక నుంచి వచ్చిన లారీ ఢీ కొట్టగా లారీ డ్రైవర్ ప్రాణాలు కోల్పోయాడు.
- మే 10న తెల్లవారుజామున 2గంటల సమయంలో ముగ్గురు స్నేహితులు శంషాబాద్ నుంచి ఘటకేసర్ వైపు తమ కారులో ప్రయాణిస్తుండగా రింగ్ రోడ్డుపై నిలిపి ఉన్న బొలేరో వాహనాన్ని వెనుక నుంచి ఢీ కొట్టారు. ఈ ఘటనలో అకస్మాత్తుగా మంటలు చెలరేగి కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు యువకులు సజీవ దహనం అయ్యారు.
- మే 4న ఓ లారీ డ్రైవర్ తన వాహనాన్ని నిలిపి రోడ్డు దాటుతుండగా మరో వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు.
- ఏప్రిల్ 4న ఓ యువతి తన స్నేహితుడితో కలిసి ద్విచక్ర వాహనంపై కోహెడ నుంచి ఘట్‌కేసర్ వైపుకు ఔటర్ సర్వీస్ రోడ్డుపై వెళ్తుండగా మద్యం మత్తులో ఉన్న ఓ వ్యక్తి తన కారుతో ఢీకొట్టి పరారయ్యాడు. ఈ ఘటనలో యువతి అక్కడే ప్రాణాలు విడిచింది.

రెవెన్యూ సదస్సులతో సత్వర పరిష్కారం

కలెక్టర్ నారాయణరెడ్డి



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్

కొత్తూరు: రైతుల ప్రయోజనాల కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న భూభారతి రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని మల్లాపూర్‌లో నిర్వహించిన సదస్సును శుక్రవారం ఆయన పరిశీలించారు. సదస్సుల్లో భాగంగా వస్తున్న దరఖాస్తులు, పరిష్కారం చేస్తున్న దరఖాస్తులను ప్రతిరోజు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారా.. అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతుల నుంచి వచ్చిన పలు దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రెవెన్యూ సదస్సుల్లో అధికారులు పారదర్శకంగా వ్యవహరిస్తూ ఎలాంటి వివాదాలకు తావులేకుండా భూసమస్యలు పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. నిజమైన దరఖాస్తులను గుర్తించి గ్రామస్తుల సమక్షంలోనే విచారణ చేపట్టి అక్కడికక్కడే పరిష్కారం చేస్తే రెవెన్యూ సదస్సుల నిర్వహణకు సార్థకత చేకూరుతుందన్నారు. సదస్సులో భాగంగా కొందరు రైతులు తాము ముగ్గురు అన్నదమ్ములమని తమకు మూడెకరాల పొలం ఉండగా ఒకరి పేరుమీదకే రికార్డులు మారడంతో ఒక్కరికే రైతు భరోసా వస్తున్నట్లు తెలిపారు. స్పందించిన కలెక్టర్ సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ సునీత, డిప్యూటీ తహసీల్దార్ జంగయ్య, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బడికి సిద్ధం చేయండి

ఇబ్రహీంపట్నంరూరల్: బడులు తెరిచే నాటికి పుస్తకాలు, యూనిఫాంలు అందుబాటులో ఉండేలా చూడాలని కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. జిల్లా విద్యా శాఖ అధికారి, పీడీ డీఆర్‌డీఏ, పీడీ మెప్మా, ఇతర సంక్షేమ శాఖ అధికారులతో శుక్రవారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జూన్ 12 నాటికి అన్ని సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలలు, గురుకులాల్లో పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయాలని అన్నారు. ఈ విషయంలో జిల్లా విద్యాధికారి ప్రత్యేక చొరవ చూపాలని, ఎక్కడా ఎలాంటి ఇబ్బంది రాకుండా చర్యలు చేపట్టాలన్నారు. పాఠశాలలు, హాస్టళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. వెంటనే మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న మధుయాష్కిగౌడ్

కాంగ్రెస్ ప్రభుత్వంలో క్రీడలకు ప్రాధాన్యత

హుడాకాంప్లెక్స్: సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం క్రీడలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తోందని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ రంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో శుక్రవారం నిర్వహించిన సమ్మర్ క్యాంపు ముగింపు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో అదనపు సదుపాయాల కల్పనకు ముఖ్యమంత్రితో పాటు కలెక్టర్‌తో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. అనంతరం అథ్లెటిక్స్, క్రికెట్, వాలీబాల్, ఫుట్‌బాల్, జిమ్నాస్టిక్స్, స్విమ్మింగ్, బ్యాడ్మింటన్, బాక్సింగ్, స్కేటింగ్ తదితర క్రీడాంశాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు జిల్లా యూత్ అండ్ స్పోర్ట్స్ అధికారి వేంకటేశ్వరరావుతో కలిసి పతకాలు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, కోచ్ అసోసియేషన్ అధ్యక్షుడు దంతి వినోద్ కుమార్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, కోచ్‌లు ఎం.వీ.ఫణికిషోర్, స్వర్ణలత, రవీందర్, సైదులు, సాయిరెడ్డి, సమీరాబేగం, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

'దోస్త్'లో దరఖాస్తు చేసుకోండి

షాద్‌నగర్ రూరల్: ఇంటర్మీడియెట్ పూర్తి చేసిన విద్యార్థులు డీగ్రీ అడ్మిషన్లకు సెంకడ్ ఫేజ్ దోస్త్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని గిరిజన సంక్షేమ గురుకులాల రీజినల్ కోఆర్డినేటర్ నాగార్జున రావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గిరిజన గురుకుల డీగ్రీ కళాశాలలో చేరాలనుకునే విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ఈ నెల 9వరకు అవకాశం ఉందని తెలిపారు. ఎంపీసీ, ఎంజెడ్సీ, బీజెడ్సీ, ఎంపీసీఎస్, బీఏ, బీకాం, ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. వివరాలకు 63050 51490, 98850 03390, 97034 41345 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

లోపాలను అధిగమిస్తే 'సర్కార్' సూపర్

రాష్ట్ర విద్యా శాఖ కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి



సమావేశంలో మాట్లాడుతున్న ఆకునూరి మురళి

మంచాల: ప్రభుత్వ పాఠశాలలు అన్ని రకాలుగా అభివృద్ధి సాధించాలంటే లోపాలను కచ్చితంగా అధిగమించాలని రాష్ట్ర విద్యా శాఖ కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి అభిప్రాయపడ్డారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తెలంగాణ పబ్లిక్ పాఠశాలగా ఏర్పాటు చేయడంలో భాగంగా శుక్రవారం విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. తల్లిదండ్రులు కమిటీగా ఏర్పడి పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామంటే తమవంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. పాఠశాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర విద్య కమిటీ సభ్యులు జ్యోత్స్న, రాజారావు, జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు, ఎంఈఓ రాందాస్, ఎంపీఓ ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వరరావు



గర్భిణులను ఆశీర్వదిస్తున్న జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వరరావు

హుడాకాంప్లెక్స్: గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా, చురుగ్గా ఉంటారని జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వరరావు అన్నారు. సరూర్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కరుణోదయ సొసైటీ ఎన్జీవో ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సీమంతం వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బాలింతలు సాధారణంగా రక్తహీనతకు గురవుతుంటారని, పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. ప్రతీనెల తప్పనిసరిగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. పేద, మధ్య తరగతి గర్భిణులకు కరుణోదయ సొసైటీ ఎన్జీవో సీమంతం చేయడం అభినందనీయమని అన్నారు. అనంతరం గర్భిణులకు పాలు, పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లు, మందులు అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఉప వైద్యాధికారి పూర్ణిమ, వైద్యాధికారులు అర్చన, చంద్రశేఖర్, ఏఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి మార్కు కనిపించాలి



తైబజార్ స్థలంలో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న అధికారులు

చేవెళ్ల: మున్సిపాలిటీల్లో వంద రోజుల ప్రణాళికతో చేపట్టే ప్రత్యేక కార్యక్రమాలతో అభివృద్ధి కనిపించాలని మున్సిపల్ శాఖ కమిషనర్ కార్యాలయం జాయింట్ డైరెక్టర్, చేవెళ్ల మున్సిపాలిటీ ప్రత్యేకాధికారి పి.శ్రీధర్ అన్నారు. మున్సిపల్ పరిధిలో వంద రోజుల ప్రణాళికలో భాగంగా జరుగుతున్న పనులను శుక్రవారం ఆయన మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్‌తో కలిసి పరిశీలించారు. చేవెళ్ల అంగడిబజార్‌కాలనీలో చెత్త చెదారం తొలగించే పనులు, మున్సిపల్ పరిధిలో ఏర్పాటు చేసే మోడ్రన్ నర్సరీ స్థలాన్ని, ప్రత్యేకంగా ఏర్పాటు చేసే పార్కు స్థలాలను పరిశీలించారు. అనంతరం శ్రీధర్ మాట్లాడుతూ.. కొత్తగా ఏర్పాటైన చేవెళ్ల మున్సిపాలిటీలో మార్కు కనిపించేలా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక నిధులు తీసుకు వచ్చేందుకు కృషి చేస్తామన్నారు. మున్సిపల్ పరిధిలో తైబజార్ అభివృద్ధి, ట్రేడ్ లైసెన్స్‌ల జారీ, వనరుల సహకారంతో అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, రాఘవేందర్, చంద్రకాంత్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

నగరానికి పచ్చని హారం

- హైదరాబాద్ చుట్టూ 189 అర్బన్ బ్లాక్‌లు
- ఇప్పటి వరకు 45 అర్బన్ ఫారెస్ట్‌లుగా అభివృద్ధి
- అందమైన ఉద్యాన వనాలుగా విస్తరణ
- గతేడాది 6.8 కోట్ల మొక్కలు నాటిన హెచ్‌ఎండీఏ
- ఈసారి 4.5 కోట్ల మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు



సాక్షి, సిటీబ్యూరో: ఉద్యాన వనాల నగరంగా పేరొందిన హైదరాబాద్‌లో పచ్చదనం విస్తరణ కోసం హెచ్‌ఎండీఏ ప్రత్యేక దృష్టి సారించింది. నగరం చుట్టూ ఉన్న ఫారెస్ట్ బ్లాకులను అర్బన్ ఫారెస్ట్ పార్కులుగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టింది. నగరం చుట్టూ వివిధ ప్రాంతాల్లో 189 బ్లాక్‌లు ఉన్నాయి. వాటిలో ఇప్పటి వరకు 45 అర్బన్ బ్లాకులను ఉద్యాన వనాలుగా తీర్చిదిద్దారు. దశల వారీగా మరిన్ని పార్కులను ఏర్పాటు చేయనున్నారు.

నర్సరీల్లో మొక్కల పెంపకంతో..

మహా నగర పరిధిని తాజాగా ఔటర్ నుంచి ట్రిపుల్ ఆర్ వరకు విస్తరించిన నేపథ్యంలో అందుకనుగుణంగా ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందజేసేందుకు అర్బన్ ఫారెస్ట్ బ్లాకుల అభివృద్ధి కార్యక్రమాన్ని చేపట్టారు. వన మహోత్సవంలో భాగంగా గత ఏడాది 6.8 కోట్ల మొక్కలను నాటారు. ఈ ఏడాది మరో 4.5 కోట్ల మొక్కలను నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు హెచ్‌ఎండీఏ అర్బన్‌ఫారెస్ట్రీ డైరెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. కోర్ అర్బన్ ఏరియాతో పాటు, హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లో మొక్కల పెంపకాన్ని ఉద్యమస్థాయిలో చేపట్టారు. హెచ్‌ఎండీఏకు చెందిన 42 నర్సరీల ద్వారా ప్రతి సంవత్సరం 5 కోట్ల మొక్కలను పెంచుతున్నట్లు ఆయన చెప్పారు. వీటిలో స్థానిక జాతులతో పాటు, అటవీ మొక్కలు, పండ్ల మొక్కలు, నీడనిచ్చే మొక్కలు, తదితర కేటగిరీలకు చెందినవి ఉన్నాయి. అలాగే ఇళ్లల్లో అలంకరణ కోసం పెంచే పూల మొక్కలను కూడా హెచ్‌ఎండీఏ నర్సరీలు అందజేస్తున్నాయి. రాష్ట్ర, జాతీయ రహదారులను ఆహ్లాదభరితం చేసే రకరకాల పూలమొక్కలను కూడా పెంచుతున్నారు.

ఆహ్లాద విహారం

నగరం శరవేగంగా విస్తరిస్తోంది. ఔటర్‌కు ఇరువైపులా వందలకొద్దీ కొత్త కాలనీలు, నివాస ప్రాంతాలు వెలిశాయి. కానీ అనేక ప్రాంతాల్లో విశాలమైన పార్కులు అందుబాటులో లేకపోవడం నగర విస్తరణలో ఒక లోపంగా మారింది.ఈ క్రమంలో శివారు ప్రాంతాలను ఆనుకొని ఉన్న పట్టణ అడవుల్లో కొంతభాగాన్ని ఉద్యాన వనాలుగా మార్పు చేయడం వల్ల వివిధ ప్రాంతాల ప్రజలకు సాయంకాలం పూట కుటుంబాలతో కలిసి పార్కుల్లో ఆహ్లాదంగా గడిపేందుకు అవకాశం లభిస్తుంది. ఈ లక్ష్యంతోనే హెచ్‌ఎండీఏ పరిధిలో చేపట్టిన పార్కుల అభివృద్ధిలో భాగంగా త్వరలో 45 పార్కులను అభివృద్ధి చేశారు.మరో 17 పార్కులు వివిధ దశల్లో ఉన్నాయి. హెచ్‌ఎండీఏతో పాటు, టీఎస్ఐఐసీ, ఎఫ్‌డీసీ, జీహెచ్‌ఎంసీ, మెట్రో రైల్ సంస్థలు కూడా పార్కుల అభివృద్ధిలో భాగస్వామ్య సంస్థలుగా నిలిచాయి.

వాకింగ్ ట్రాక్‌లు, యోగా ప్లేస్‌లు

- ప్రతి అర్బన్ ఫారెస్ట్ పార్కులో తప్పనిసరిగా ప్రవేశద్వారం, నడకదారి, వ్యూ పాయింట్ ఏర్పాటు ఉండేలా ఏర్పాటు చేశారు. పిల్లలకు ఆట స్థలం, యోగా షెడ్, సైక్లింగ్, వనదర్శిని కేంద్రం వంటి వాటికి ఈ పార్కుల్లో ప్రాధాన్యమిస్తున్నారు. మరోవైపు 189 ఫారెస్ట్ బ్లాకుల్లో 100 శాతం చిక్కటి అడవి పెరిగేలా, స్థానిక స్థలం, మట్టి స్వభావం, వాతావరణ పరిస్థితి ఆధారంగా పెద్ద ఎత్తున మొక్కలను పెంచుతున్నారు. మరోవైపు 158 కిలోమీటర్ల ఔటర్‌రింగ్‌రోడ్డుకు ఇరువైపులా సుమారు 97 లక్షల మొక్కలను పెంచేందుకు చర్యలు చేపట్టారు. గత పదేళ్లుగా హైదరాబాద్ నగరంలో పచ్చదనం విస్తరణ 33.15 చ.కి.మీ. నుంచి 81.81 చ.కి.మీలకు పెరిగినట్లు అంచనా.

రెండ్రోజుల ముందే రెక్కలు కట్టుకుని..

ఈ నెల 8న పంపిణీ చేయనున్న చేప ప్రసాదం కోసం నగరంలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌కు శుక్రవారం సాయంత్రం బిహార్, ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి వందలాది మంది అస్తమా రోగులు తరలివచ్చారు. రెండ్రోజుల ముందుగానే వచ్చిన వీరికి పలు స్వచ్ఛంద సంస్థలు, పోలీసులు భోజనాలు, ఇతర వసతులు కల్పించనున్నారు.

– అబిడ్స్



నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్‌నకు ఎంపిక


ప్రశాంత్ అలన్య


మేఘన


మనీష

షాద్‌నగర్: కేంద్ర ప్రభుత్వం అందించే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్ఎస్)కు ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని దూసకల్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. గ్రామానికి చెందిన మంగళి ప్రశాంత్, అలన్యలు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నారు. వీరు స్కాలర్‌షిప్ కోసం నిర్వహించిన పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. వీరికి 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు సంవత్సరానికి రూ.12వేల చొప్పున కేంద్ర ప్రభుత్వం స్కాలర్‌షిప్ అందిస్తుంది. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

యాచారం నుంచి ఇద్దరు..

యాచారం: కుర్మిద్ద ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థినులు మేఘన, మనీష నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు హెచ్‌ఎం సత్తు పాండురంగారెడ్డి తెలిపారు. వీరికి 9నుంచి 12వ తరగతి పూర్తయ్యే వరకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఏటా రూ.12 వేల ఉపకార వేతనం అందుతుందన్నారు.

మజీద్‌పూర్ నుంచి 15 మంది..

అబ్దుల్లాపూర్‌మెట్: మజీద్‌పూర్ ఉన్నత పాఠశాలకు చెందిన 15 మంది విద్యార్థులు నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ విజయ భాస్కర్‌రెడ్డి తెలిపారు. రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా మొత్తం 285 స్టూడెంట్స్ ఇందుకు సెలెక్ట్ అవగా తమ స్కూల్ 15 మందితో రెండో స్థానంలో నిలిచిందన్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు బ్యాంకు రుణాలు

అలీప్ సంస్థ కమిటీ సభ్యురాలు మల్లిక


అవగాహన కల్పిస్తున్న అలీప్ సంస్థల సభ్యులు

చేవెళ్ల: స్వయం సహాయక సంఘాల సభ్యులు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు కావాల్సిన నైపుణ్య శిక్షణలు పొంది అభివృద్ధి చెందాలని అలీప్(అసోషియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్‌ప్రెన్యూర్ ఆఫ్ ఇండియా) సంస్థ కమిటీ సభ్యురాలు మల్లిక, సెర్ప్ ఏపీఎం శోభారాణి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో మహిళా సమాఖ్య సభ్యులకు ప్రభుత్వ పరిశ్రమల శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) ఆధ్వర్యంలో అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అలీప్ సంస్థ సభ్యులు పరిశ్రమల నిర్వహణ, ఉత్పత్తుల మార్కెటింగ్ మెళకువలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణ తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే మహిళలకు ప్రభుత్వం బ్యాంకు రుణాలు ఇప్పిస్తుందన్నారు. ఆసక్తి ఉన్న మహిళలు ముందుకు వస్తే వారికి వృత్తి నైపుణ్యాలలో 15 రోజులు శిక్షణ ఉంటుందని చెప్పారు. ఈ సమావేశంలో అలీప్ సంస్థ సభ్యులు, సీసీలు షబ్బీర్, ప్రభాకర్, సాగర్, నర్సింలు, శ్రీనివాస్, మానెయ్య, యాదయ్య, తదితరులు ఉన్నారు.

ఆవు కళేబరంతో ఆందోళన

నందిగామ: పరిశ్రమ వదులుతున్న కాలుష్యం కారణంగా తన పాడి ఆవు చనిపోయిందని ఆరోపిస్తూ బాధిత కుటుంబ సభ్యులు శుక్రవారం ఫ్యాక్టరీ ఎదుట ఆందోళనకు దిగారు. పెద్దకుంటతండాకు చెందిన శ్రీను వ్యవసాయంతో పాటు ఆవులను పోషిస్తూ పాలు ఉత్పత్తి చేస్తున్నాడు. ఎంఎస్ఎన్ పరిశ్రమ వెనకాలే ఇతని పాక ఉంది. ఫ్యాక్టరీ నుంచి వెలువడే వాయు, నీటి కాలుష్యంతో తన ఆవులు తరచూ అనారోగ్యం బారిన పడుతున్నాయని తెలిపాడు. శుక్రవారం రూ.లక్ష విలువ చేసే ఆవు మృతిచెందిందని వాపోయాడు. ట్రాక్టర్ ట్రాలీలో ఆవు కళేబరాన్ని వేసుకుని ఫ్యాక్టరీ గేటు ఎదుట ఆందోళన చేపట్టాడు. రెండు రోజుల్లో పరిహారం చెల్లిస్తామని యాజమాన్యం, హెచ్ఆర్ ప్రతినిధి హామీ ఇవ్వడంతో శాంతించారు.

కేబుల్ బ్రిడ్జిపై కారు దగ్ధం

మాదాపూర్: దుర్గంచెరువు కేబుల్ బ్రిడ్జిపై ఎలక్ట్రికల్ లోపం కారణంగా శుక్రవారం ఓ కారు దగ్ధమైంది. మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ తెలిపిన వివరాల ప్రకారం సాయంతం నాలుగు గంటల ప్రాంతంలో కేబుల్‌బ్రిడ్జిపై ఓ కారులో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ఇనార్బిట్ మాల్ నుంచి జూబ్లీహిల్స్ వెల్తుండగా ఘటన జరిగినట్లు గుర్తించారు. మంటలు చెలరేగగానే అందులో ప్రయాణిస్తున్న వారు కారు దిగి వెళ్లిపోయారని, మియాపూర్‌కి చెందిన పి.శ్రీరామ్ రెడ్డి పేరుతో కారు రిజిస్టర్ అయినట్టు తెలిపారు. ఈ మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గతంలో అక్రమాలపై ఏం చర్యలు తీసుకున్నారు?

సమయానికి రాలేనప్పుడు సమావేశాలు ఎందుకు పెట్టాలి

- సీపీఎం, వ్యవసాయ కార్మిక సంఘం నేతల మండిపాటు
- 'ఉపాధి' సామాజిక తనిఖీ నివేదికపై మండల ఓపెన్ ఫోరం


సామాజిక తనిఖీ నివేదిక సమావేశంలో డీఆర్‌డీఓ పీడీ శ్రీలత

ఇబ్రహీంపట్నం: సమయానికి రాలేనప్పుడు.. సమావేశాలు ఎందుకు పెట్టాలని సీపీఎం, వ్యవసాయ కార్మిక సంఘం నేతలు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఉపాధి హామీ పథకం- 17వ విడత సామాజిక తనిఖీ బృందం గత నెల 29 నుంచి ఈనెల 5వ తేదీ వరకు మండలంలో గ్రామ సభలు నిర్వహించింది. శుక్రవారం ఉదయం 10 గంటలకు మండల స్థాయి సామాజిక తనిఖీ నివేదికపై మండల ఓపెన్ ఫోరం నిర్వహిస్తామని అధికారులు ముందుగానే ప్రకటించారు. ఆతర్వాత ఏమైందో కానీ మధ్యాహ్నం ఒంటిగంటకు కార్యక్రమం ప్రారంభమవుతుందని గురువారం రాత్రి వాట్సప్ గ్రూప్‌ల ద్వారా మెసేజ్ పెట్టారు. కానీ మూడు గంటల ఆలస్యంగా డీఆర్‌డీఓ పీడీ కె.శ్రీలత, అడిషనల్ డీఆర్‌డీఓ సుభాషిణి తదితరులు హాజరయ్యారు. దీనిపై సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సామెల్, మండల కార్యదర్శి సీహెచ్ జంగయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు జగన్ తదితరులు అధికారులను నిలదీశారు. అరగంటపాటు ఇదే విషయంపై వాగ్వాదం జరిగింది. గతేడాది సోషల్ ఆడిట్‌లో వెలుగు చూసిన అక్రమాలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఫోరం నివేదికపై సమాచార ప్రతులు ఇవ్వలేదని, ఓపెన్ ఫోరంను నాలుగు గోడల మధ్య ఎందుకు నిర్వహిస్తున్నారని మండిపడ్డారు. దీనిపై పీడీ శ్రీలత స్పందిస్తూ పోరం నివేదిక అంశాలపై సమాచార ప్రతులను అందరికీ ఇవ్వాలని పథకంలో లేదని, ఓపెన్ ఫోరంను బహిరంగంగా కాకుండా ఇన్ హౌస్ నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశించారని చెప్పడంతో మరింత గందరగోళం నెలకొంది.

జాప్యమెందుకు..

పనులు చేసి 8 వారాలు గడుస్తున్నా.. కూలీలకు డబ్బులు ఇవ్వకుండా ఎందుకు జాప్యం చేస్తున్నారని సీపీఎం నేతలు సామెల్, జంగయ్య, జగన్, నర్సింహ్మ, బుగ్గరాములు ప్రశ్నించారు. పెండింగ్ బిల్లులు రెండుమూడు రోజుల్లో చెల్లిస్తామని పీడీ తెలిపారు.

కూలీలు ఎందుకు తగ్గుతున్నారు..?

ఉపాధి హామి కూలీల సంఖ్య రోజురోజుకూ ఎందుకు తగ్గుతుందో చెప్పాలని సీపీఎం నేతలు డిమాండ్ చేశారు. సంబంధిత అధికారుల నిర్లక్ష్యం, అలసత్వం, చేసిన పనికి డబ్బులు చెల్లించకపోవడం తదితర కారణాలతోనే ఈ దుస్థితి నెలకొంటోందన్నారు. కూలీలకు పనులు కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అడిగిన వారందరికి జాబ్ కార్డులిచ్చి పనులు కల్పిస్తామని పీడీ తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, సామాజిక తనిఖీ బృందం, పంచాయతీరాజ్, అటవీశాఖ అధికారులు మినహా ఈ సమావేశానికి ఉపాధి హామి కూలీలెవ్వరూ రాకపోవడం గమనార్హం. ఈ సమావేశంలో ఎస్‌టీఎం యాదగిరిగౌడ్, ఎస్ఆర్పీ నరేందర్, డీపీఓ కొండయ్య, ఏపీడీ చరణ్, సునిత ఇన్‌చార్జి ఎంపీడీఓ యెల్లంకి జంగయ్యగౌడ్, ఏపీఓ చారి తదితరులు పాల్గొన్నారు.

బెట్టింగ్ నిర్వహిస్తున్న బుకీ అరెస్టు

సనత్‌నగర్: క్రికెట్ బెట్టింగ్ కేంద్రాన్ని నిర్వహిస్తున్న ఓ బుకీతో సహా మరో ఇద్దరిని బేగంపేట పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని రసూల్‌పురా గన్‌బజార్‌లో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు సమాచారం అందుకున్న ఎస్ఐ వరలక్ష్మి, ఇతర సిబ్బంది గురువారం సాయంత్రం ఆకస్మికంగా దాడి చేశారు. ఓ ఇంట్లో బెల్లం కిరణ్‌కుమార్‌రెడ్డి అనే వ్యక్తి క్రికెట్ బెట్టింగ్ కేంద్రాన్ని నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. అదే ఇంట్లో సుధాకర్‌రెడ్డి, మయూర్ జోషి అనే ఇద్దరు పందెం కాసేవారు కూడా ఉండడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. సంఘటన స్థలం నుంచి ఓ ల్యాప్‌ట్యాప్, రూ.1,44,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. ల్యాప్‌ట్యాప్‌లో ఇన్‌స్టాల్ చేసిన మ్యాట్రిక్స్ బెట్టింగ్ సాఫ్ట్‌వేర్ ద్వారా క్రికెట్ పందేలు నిర్వహిస్తున్నట్లు పోలీసులు కనుగొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జూనియర్ కళాశాలగా కస్తూర్బా

జిల్లేడ్ చౌదరిగూడ కేజీబీవీని అప్‌గ్రేడ్ చేసిన ప్రభుత్వం


కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల భవనం

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని తూంపల్లిలో కొనసాగుతున్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేసినట్లు ప్రత్యేకాధికారి రాగ సుధా ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరానికి గాను బైపీసీ, ఎంపీసీ గ్రూప్‌లు నిర్వహించేందుకు ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చినట్లు పేర్కొన్నారు. ఒక్కో గ్రూప్‌లో కేవలం 40 మందిని మాత్రమే అడ్మిషన్ చేసుకుంటామన్నారు. ఈ గ్రూప్‌లలో చేరడానికి ఆసక్తి గల విద్యార్థినులు ఈ నెల 12వ తేదీ లోపు తమ సర్టిఫికెట్లు తీసుకొని నేరుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అతిథి అధ్యాపకుల కోసం దరఖాస్తులు

కళాశాల విద్యార్థులకు విద్యాబోధన చేసేందుకు అతిథి(గెస్టు) అధ్యాపకులుగా పనిచేయుటకు ఆసక్తి గల మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రత్యేకాధికారి రాగ సుధా తెలిపారు. తెలుగు, ఆంగ్లం, గణితం, భౌతికశాస్త్రం, వృక్షశాస్త్రం, జీవశాస్త్రం, రసాయనశాస్త్రం బోధించుటకు ఆసక్తి గలవారు ఈ నెల 12వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 91005 51506ను సంప్రదించాలన్నారు.

విద్యార్థులకు క్రమశిక్షణ అవసరం


ఎన్‌సీసీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కర్నల్ సి.ఎస్.రావు తదితరులు

మొయినాబాద్‌రూరల్: ఎన్‌సీసీలో చేరుతున్న విద్యార్థులు క్రమశిక్షణ, దేశభక్తితో పాటు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవచ్చని 7వ గర్ల్స్ బెటాలియన్ కమాండింగ్ అధికారి కర్నల్ సి.ఎస్.రావు, చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ డైరెక్టర్ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి డాక్టర్ సాత్వికరెడ్డి పేర్కొన్నారు. హిమాయత్‌నగర్ సమీపంలోని విశ్వవిద్యాలయంలో శుక్రవారం ఎన్‌సీసీ రైజింగ్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కర్నల్ మాట్లాడుతూ.. ఎన్‌సీసీలో చేరిన విద్యార్థులందరూ క్రమశిక్షణ ఎంతో అవసరమన్నారు. నాయకత్వ లక్షణాలను పెంపొందించుకొని దేశభక్తి గౌరవాన్ని నిలిపేందుకు అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యార్థులకు ఉద్యోగ అవకాశాల్లో ఎన్‌సీసీ సర్టిఫికెట్లు తోడ్పడతాయని తెలిపారు. కార్యక్రమంలో మేజర్ రేవతిప్రభాకరన్, కెప్టెన్ డాక్టర్ పి.కవిత తదితరులు పాల్గొన్నారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత

ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి


ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

నందిగామ: సమాజంలోని ప్రతిఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌కుమార్ రెడ్డి సూచించారు. మండల పరిధిలోని శ్రీనివాసులుగూడలో శుక్రవారం హనుమాన్ దేవాలయం ఆవరణలో ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. దైనందిన జీవితంలో ప్రతిఒక్కరూ దైవచింతన అలవాటు చేసుకోవాలని, దీంతో మానసిక ఒత్తిడిలు దూరం అవుతాయని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ గణేష్, పీఏసీఎస్ చైర్మన్ అశోక్, నాయకులు మురళీయాదవ్, శ్రీశైలం, చంద్రారెడ్డి, నర్సింహాగౌడ్, నారాయణరెడ్డి, రవీందర్, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవిశ్వశాంతి మహాశక్తి గణపతిగా ఖైరతాబాద్ వినాయకుడు


కర్రపూజలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు



శ్రీ విశ్వశాంతి మహాశక్తి గణపతి నమూనా

ఖైరతాబాద్: ప్రతి యేటా వివిధ రూపాలలో దర్శనమిచ్చే ఖైరతాబాద్ మహాగణపతి ఈ సంవత్సరం శ్రీ విశ్వశాంతి మహాశక్తి గణపతిగా భక్తులకు దర్శనమివ్వనున్నాడు. శుక్రవారం సాయంత్రం నిర్జల ఏకాదశి సందర్భంగా కర్రపూజ నిర్వహించి మహాగణపతి తయారీ పనులకు శ్రీకారం చుట్టారు. 71వ సంవత్సరం సందర్భంగా 69 అడుగుల ఎత్తులో విగ్రహాన్ని రూపొందిస్తారు. కర్రపూజ(తొలిపూజ)ను ఖైరతాబాద్ శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ, ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, మేయర్ విజయలక్ష్మి, కార్పొరేటర్ విజయారెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా ఈ సంవత్సరం శ్రీ విశ్వశాంతి మహాశక్తి గణపతి మూర్తి నిలబడి ఉండే ఆకారంలో ఏర్పాటు చేస్తున్నట్లు శిల్పి చిన్నస్వామి రాజేంద్రన్ తెలిపారు. 69 అడుగుల ఎత్తులో వినాయకుడు, పక్కనే 10 అడుగుల ఎత్తులో జగన్నాథస్వామి, లలితా త్రిపుర సుందరి అమ్మవార్ల విగ్రహాలు, మహాగణపతి ఇరువైపులా కుడి వైపు లక్ష్మీ సమేత హయగ్రీవుడు, ఎడమవైపు గజ్జలమ్మ అమ్మవారి విగ్రహాలు 15 అడుగుల ఎత్తులో ఉంటాయన్నారు. ఈ సంవత్సరం వినాయకచవితి ఆగస్టు 27న, నిమజ్జనం సెప్టెంబర్ 6వ తేదీన జరుగుతాయి.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


ఘటనాస్థలిలో మృతదేహం

చేవెళ్ల: లారీ ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన వర్త్య హర్షవర్ధన్(19) చదువుకుంటూ ఉపాధి కోసం చిన్నచిన్న పనులు చేసుకుంటున్నాడు. గురువారం అతడు పని నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లి తిరిగి అర్ధరాత్రి వికారాబాద్‌కు బయలుదేరాడు. మార్గమధ్యలో దామరగిద్ద సమీపంలోకి రాగానే వికారాబాద్ నుంచి చేవెళ్ల వస్తున్న ఓ లారీ అతివేగంగా వచ్చి అతడి బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో హర్షవర్ధన్ అక్కడిక్కడే మృతి చెందాడు. స్థానికులు సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలికి వెళ్లి పరిశీలించారు. అతని వద్ద లభించిన ఆధారాలతో కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వివాహితపై లైంగిక దాడి.. ఆపై బెదిరింపులు

నిందితుడిపై కేసు నమోదు

సనత్‌నగర్: భర్తతో మనస్పర్థలు వచ్చి దూరంగా ఉంటున్న వివాహితను బలవంతంగా హోటల్‌కు పిలిపించాడు. మత్తు మందు కలిపిన పండ్ల రసం ఇచ్చి ఆమె స్పృహ కోల్పోయేలా చేశాడు. అనంతరం లైంగిక దాడి చేయడమే కాకుండా ఆ సమయంలో ఫొటోలు, వీడియోలు తీసి కుటుంబ సభ్యులకు పంపుతానని బెదిరించి డబ్బులు వసూలు చేసిన వ్యక్తిపై బేగంపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..బేగంపేట ప్రాంతానికి చెందిన మహిళ (37)కు 2013లో వివాహం కాగా, భర్తతో కలిసి మహారాష్ట్రలో నివాసం ఉండేది. భర్తతో మనస్పర్థల కారణంగా గొడవ పడి ఐదు నెలల క్రితం బేగంపేటలోని తన తల్లి ఇంటికి వచ్చి ఉంటోంది. కాగా జనవరిలో నిజాముద్దీన్ అనే వ్యక్తి మహిళకు ఫోన్ చేసి డెలివరీ బాయ్‌నని చెప్పగా, తాను ఎటువంటి ఆర్డర్ చేయలేదని ఫోన్ పెట్టేసింది. అప్పటి నుంచి నిజాముద్దీన్ తరచూ మహిళకు ఫోన్ చేస్తూ, సందేశాలు పంపుతూ బయటకు రమ్మని తీవ్రంగా ఒత్తిడి చేశాడు. చివరకు అతని వేధింపుల తట్టుకోలేక బాధితురాలు ఓ రోజు నగరంలోని పబ్లిక్ గార్డెన్స్‌లో కలిసింది. భర్తతో గొడవలు ఉన్నందున అతడికి విడాకులు ఇవ్వాలని, తాను పెళ్లి చేసుకుంటానని చెప్పాడు. విడాకుల కోసం దరఖాస్తు చేసేందుకు ఆమె ఆధార్‌కార్డు తీసుకున్నాడు. అనంతరం ఓ న్యాయవాదిని కలిసేందుకని గుడిమల్కాపూర్ సమీపంలోని ఓ హోటల్‌కు తీసుకుపోయాడు. హోటల్‌లో బాధితురాలికి మత్తు కలిపిన పండ్ల రసం ఇచ్చాడు. బాధితురాలు స్పృహ కోల్పోయిన తర్వాత ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆ సమయంలో ఫొటోలు, వీడియోలు తీశాడు. ఆ తర్వాత న్యాయవాది రాలేదని ఆమెను పంపించేశాడు. కొన్ని రోజుల తర్వాత మళ్లీ ఫోన్ చేసి తనకు లక్ష రూపాయలు ఇవ్వాలని, లేనిపక్షంలో ఫొటోలు, వీడియోలు కుటుంబ సభ్యులకు పంపుతానని బెదిరించాడు. దీంతో భయపడిన మహిళ ఏప్రిల్‌లో లక్ష రూపాయలు అతనికి ఇచ్చింది. మళ్లీ కొన్ని రోజులకు ఫోన్ చేసి తనను కలవాలని, లేకుంటే ఫొటోలు, వీడియోలు అందరికీ పంపుతానని హెచ్చరించాడు. ఆమె అంగీకరించలేదు. ఓ రోజు స్నేహితురాలితో కలిసి వస్తుండగా బాధితురాలిని కారులో బలవంతంగా తీసుకుపోయాడు. ఓ హోటల్‌కు తీసుకెళ్లి మరోసారి లైంగిక దాడి చేశాడు. దీంతో బాధితురాలు గురువారం బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిందితుడు నిజాముద్దీన్‌పై కేసు నమోదు చేసిన బేగంపేట పోలీసులు సంఘటన జరిగిన ప్రాంతాన్ని బట్టి గుడిమల్కాపూర్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు.

ముగిసిన హ్యాండ్‌బాల్ పోటీలు


బాలికల విభాగంలో తృతీయ బహుమతి అందుకుంటున్న రంగారెడ్డి జట్టు

నకిరేకల్: నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం మంగళపల్లి గ్రామంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న 47వ హ్యాండ్‌బాల్ తెలంగాణ రాష్ట్ర స్థాయి పోటీలు శుక్రవారం ముగిశాయి. బాలుర విభాగంలో కరీంనగర్ జట్టు ప్రథమ స్థానంలో నిలవగా, ద్వితీయ స్థానంలో వరంగల్ జట్టు, తృతీయ స్థానంలో నల్లగొండ జట్టు నిలిచింది. బాలికల విభాగంలో వరంగల్ జట్టు ప్రథమ స్థానం, ఖమ్మం జట్టు ద్వితీయ, రంగారెడ్డి జిల్లా జట్టు తృతీయ స్థానం సాధించాయి.

విదేశీ మద్యం సీజ్

చందానగర్: అక్రమంగా మిలటరీ, విదేశీ మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసిన సంఘటన శేరిలింగంపల్లి పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రంగారెడ్డి జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఆర్.కిషన్ వివరాలు వెల్లడించారు. మియాపూర్ మాతృశ్రీనగర్ కాలనీలో నివాసముండే మన్నవ గాంధీ అక్రమంగా విదేశీ మద్యం, మిలటరీ క్యాంటీన్‌లో లభించే మద్యం విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో సీఐ సుభాష్ చందర్‌రావు, ఎస్ఐ అఖిల్ సిబ్బందితో కలిసి అతని ఇంటిపై దాడులు జరిపారు. అతని వద్ద నుంచి 160 విదేశీ, మిలటరీ మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

మాగంటి త్వరగా కోలుకోవాలి: మంత్రి పొన్నం

సాక్షి, సిటీబ్యూరో: బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ త్వరగా కోలుకోవాలని ఆ దేవుణ్ణి ప్రార్థిస్తున్నానని హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఆయన ఆరోగ్యం క్షీణించడంతో ప్రభుత్వ కార్యక్రమాలకు హాజరుకావడం లేదని పేర్కొన్నారు. 'ఇన్‌చార్జి మంత్రిగా నేను, ఎమ్మెల్యేగా ఆయన అనేక దఫాలు కలిశాం. ఇది రాజకీయాలకు అతీతంగా మాట్లాడాల్సిన సమయం. బీఆర్ఎస్ నాయకులు ఈ సందర్భాన్ని రాజకీయం చేయాలని చూస్తున్నారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చారనే అక్కసుతోనే ఆరోపణలు చేస్తున్నారు' అని పొన్నం పేర్కొన్నారు.